# సింగిల్ పేజీ కథలు

''అయ్యా! ఓ రెండ్రూపాయలిప్పించండయ్యా! మా కుర్రదానికి జొరంగా వుందని డాక్టరుబాబు దగ్గరకొచ్చేమయ్యా! మందులు కొన్నా, యింటికి తిరిగెళ్లడానికి బస్సు చార్జీలకి రెండు రూపాయలు తక్కువొచ్చినాయండి. కనికరించండి బాబూ! మీకు పున్నెం వుంటాదయ్యా!''

ఆర్.టి.సి.బస్ స్టాండులో దీనంగా అర్థిస్తోంది ఓ మధ్య వయస్కురాలు. అక్కడే బల్ల మీద తువ్వాలు కప్పుకుని ఓ ఎనిమిదేళ్ల పిల్ల ముడుచుకు కూర్చుంది. ఆమె ముఖంలో అలసట, అనారోగ్యం, నిస్ప్రాణ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆ పెద్దామె మాటలకి అక్కడ ఎవరిలోనూ స్పందన లేదు. ఆమె అడుక్కుంటున్న తీరులో నిజాయితీ కనబడుతోంది. అడుక్కోవడం ఆమె వృత్తికానట్టు, తప్పనిసరి పరిస్థితుల్లోనే ఆమె ఆ పని చేస్తున్నట్టు అనిపిస్తోంది ఆమె వాలకం చూస్తే!

''చూసేవుటోయ్! యిదో రకం మర్యాద యాచన. అడుక్కోడానికి ఓ కారణం వుండాలిగా. చాలా ఘరానాగా అడుక్కుంటోంది కదూ?'' రాధ చేతిలో వున్న టిఫిన్ బాక్సు బ్యాగ్‌లో పెడుతూ అంది.

''ఛ వూరుకో! పరిస్థితులకి మనిషెప్పుడూ బానిసే. అవసరం మనిషి చేత ఎలాంటి పనినైనా చేయిస్తుందొకోసారి.''

''ఆహా అలాగా!'' రాధ మాటల్లో వెటకారం.


''అవునోయ్! నాకేమిటో ఆమె వృత్తిపరంగా యాచకురాలిలా అనిపించడం లేదు. ఆమె చెప్పింది నిజం ఎందుక్కాకూడదూ'' నా మాటలకి రాధ వెంటనే అంది.

''ఏం తల్లీ! బుద్ధుడికి అదెక్కడో జ్ఞానోదయం అయినట్టు నీకీ ఆర్టిసి కాంప్లెక్సులో జ్ఞానోదయం అయిందా ఏం?'' అంది కిలకిలా నవ్వుతూ.

కుడిభుజం మీద బ్యాగ్ ఎడం భుజానికి మారుస్తూ-

## అనుభవం

''ఛుప్! కుళ్లు జోకులెయ్యకు! నీకు తోస్తే సహకరించు, లేకపోతే కామ్‌గా మూసుకో. ఆవిడ వింటే ఫీలవుతుంది'' మందలిస్తూ అన్నాను.




''సరేలేవోయ్! ఆ మేగజైన్ యిటివ్వు. బస్ వచ్చేదాకా!'' అంటూ మేగ్‌జైన్ తీసుకుని చూడసాగింది.

సాధారణంగా ఏ మనిషీ ఎప్పుడూ పరుల మీద ఆధారపడాలనుకోడు. ఒకోసారి తప్పనిసరి పరిస్థితుల్లో మనం అనుకోకుండానే పరుల మీద ఆధారపడవలసిన పరిస్థితి ఎదురవుతుంది. దీనికి పది రోజుల కిందట జరిగిన సంఘటన నాలో ఓ ఫ్లాష్ బాక్!

★ ★ ★

ఆదివారం కదాని బట్టలన్నీ వాషింగ్ మెషిన్‌లో వేశాను. ఆరిపోయాయి. ఇస్త్రీ కోసం రెడీగా వుంచాను. టి.వి.లో ఏదో ప్రోగ్రాం వస్తోంది. ఇంతలో ఫోను రింగయింది.

రాజమండ్రి నుండి అక్క ఫోన్. ఉన్నఫళంగా బయల్దేరి రమ్మని. వాళ్ళ అమ్మాయిని చూడ్డానికి పెళ్లివారొస్తున్నారని, నన్ను మరీ మరీ రావాలంటూ చెప్పింది. టైము 12 కావస్తోంది. ఏదో రెండు మెతుకులు నోట్లో వేసుకుని హడావుడిగా రెండు డ్రస్సులు బ్యాగ్‌లో సర్దుకుని ఆటోలో బయల్దేరాను.

'విశాఖ నుండి విజయవాడ పోవు రత్నాచల్ మరికొద్ది సేపట్లో బయలుదేరును' కీచుగొంతుతో అన్ని భాషల్లోనూ అనౌన్సు చేస్తోంది. ఆదరాబాదరా బుకింగు వేపు పరుగెత్తాను.

''రాజమండ్రికో టికెట్!'' అన్నాను.

''రెండ్రూపాయలు చిల్లర కావాలి మేడమ్!'' టికెట్ బుకింగు క్లర్కు అడిగేడు.

''చిల్లరా?'' అప్పుడు చూసుకున్నా. హడావుడిలో అసలు చిల్లరే వేసుకోలేదు బ్యాగ్‌లో. రెండ్రూపాయలిస్తే కాని టికెట్ రాదు. ఎలా? యింతలో వెనక నుండి-

''ఈ రెండు రూపాయలు తీసుకుని మేడమ్‌కి టికెట్ ఇవ్వండి'' అంటూ అతను రెండు రూపాయలివ్వడం, టికెట్ నా చేతిలో క్లర్కు పెట్టడం జరిగాయి. నేను మెదిలేసరికి ఆ ఆసామీ వెళ్లిపోయాడు. ట్రైను దగ్గర ఆ ఆసామీ కోసం చూసాను. అతను ఆ జనవాహినిలో నాకు కనపడలేదు.

దేవుడే పంపేడా ఈ దూతని? నాకతను బాకీ వున్నాడా కిందటి జన్మలో? ఏమో! కొన్ని సంఘటనలు గమ్మత్తుగా జరుగుతాయి.

★ ★ ★

''అదుగోనోయ్ మన బస్ వచ్చేసింది'' రాధ హడావుడిగా బస్‌వైపు పరుగెడుతూ అంది.

ఊహాలోకం నుండి ఊడిపడ్డ నేను తెప్పరిల్లి రెండు రూపాయల నోటు ఆ అమ్మాయి చేతిలో వుంచి బస్ కోసం పరుగెత్తాను.

-పూడిపెద్ది నీలవేణి
(శృంగవరపుకోట)